సాక్షి ఆదిలాబాద్

సోమవారం । 30 । జూన్ । 2025



ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా

గుడిహత్నూర్‌లోని జాతీయరహదారి 44పై ఆదివారం తెల్లవారుజామున ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బోల్తావడింది. ఈ ఘటనలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. 8లో ▸



కలగానే టూరిజం

ఏజెన్సీ పరిధిలోని మత్తడి చెరువు ప్రకృతి ప్రేమికుల మది దోచుకుంటున్నా పర్యాటకంగా మాత్రం ఎలాంటి అభివృద్ధికి నోచుకోవడం లేదు. 9లో ▸

గరిష్టం/కనిష్టం 30.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జిగా రఘువీర్‌రెడ్డి

కైలాస్‌నగర్: స్థానికసంస్థల ఎన్నికలపై కాంగ్రెస్ అధిష్టానం ప్రత్యేక దృష్టి సారించింది. మండల, జిల్లా పరిషత్, పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు వరుసగా రానున్న నేపథ్యంలో పార్టీ గెలుపే లక్ష్యంగా కసరత్తు షురూ చేసింది. క్షేత్రస్థాయిలో నేతలను సమన్వయం చేసుకుంటూ గెలుపుదిశగా కార్యాచరణ అమలు చేసేందుకు గాను ప్రతీ పార్లమెంట్ నియోజకవర్గానికి ఇన్‌చార్జీలను ప్రకటించింది. ఎస్టీ రిజర్వ్‌డ్ నియోజకవర్గమైన ఆదిలాబాద్ పార్లమెంట్‌కు ఇన్‌చార్జిగా టీపీసీసీ ఉపాధ్యక్షుడు, నల్గొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డికి బాధ్యతలు అప్పగించింది. ఆయనతోపాటు పీసీసీ జనరల్ సెక్రెటరీలుగా ఉన్న సీహెచ్.రాంభూపాల్, బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి, అచ్యుత రమేశ్‌బాబులను కూడా అదనంగా నియమిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్ ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు.

మహలనోబిస్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: జాతీయాదాయం అంచనా వేయడంలో, ప్రభుత్వ విధానాలు రూపొందించడంలో గణాంకాలు కీలకపాత్ర పోషిస్తాయని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ప్రశాంత చంద్ర మహలనోబిస్ జయంతి పురస్కరించుకుని జాతీయ గణాంక దినోత్సవాన్ని కలెక్టరేట్‌లో ఆదివారం నిర్వహించారు. క్యాంపు కార్యాలయంలో ప్రణాళికశాఖ అధికారులు, ఉద్యోగులతో కలిసి ప్రశాంత చంద్ర మహలనోబిస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. గణాంక కార్యకలాపాలను సమన్వయం చేసేందుకు మహలనోబిస్ వివిధ సంస్థలు, పద్ధతులను ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి బి.వెంకటరమణ, డివిజనల్, మండల గణాంక అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జూలై 1న జిల్లాస్థాయి అండర్–10, 12, 14 విభాగాల్లో బాలబాలికలకు అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి రాజేశ్ ప్రకటనలో పేర్కొన్నారు. అండర్–10 విభాగంలో 60 మీటర్ల స్టాండింగ్ బ్రాడ్ జంప్ ఈవెంట్ ఉంటుందని తెలిపారు. అండర్–12లో 60 మీటర్ల లాంగ్‌జంప్, జావెలిన్ పోటీలు ఉంటాయని వివరించారు. అండర్–14 విభాగంలో ట్రయథ్లాన్ పోటీలు ఉంటాయన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారిని జూలై 6న హన్మకొండ వేదికగా నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనదలచిన వారు ఒరిజినల్ జనన ధ్రువీకరణ పత్రంతో స్టేడియంలో మంగళవారం ఉదయం 9 గంటలకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వివరాలకు 9492136510 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రాహుల్ ఫర్టిలైజర్ లైసెన్స్ సస్పెన్షన్

నార్నూర్: రైతులకు ఇష్టారీతిన విత్తనాలు విక్రయిస్తున్న మండల కేంద్రంలోని రాహుల్ ఫర్టిలైజర్ దుకాణం లైసెన్స్‌ను సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జి.శ్రీధర్‌స్వామి తెలిపారు. మండలంలోని గుంజాలకు చెందిన కుంరం నీలాబాయి అనే రైతు మండలకేంద్రంలోని రాహుల్ ఫర్టిలైజర్స్‌లో విత్తనాలు కొనుగోలు చేశారు. అయితే అవి నాణ్యతగా లేవని, మొలకశాతం సరిగా రాలేదని పేర్కొంటూ ఇటీవల ఆమె గ్రీవెన్స్‌లో కలెక్టర్ రాజర్షి షాకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు విచారణ చేపట్టాలని ఆయన జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని ఆదేశించారు. ఈ మేరకు క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారులు విచారణ చేపట్టారు. సదరు డీలర్ బిల్‌బుక్‌లు, స్టాక్ రిజిస్టర్లు నిర్వహించకుండా ఇష్టారీతిన విత్తన విక్రయాలు జరుపుతున్నట్లు గుర్తించారు. ఈ నివేదిక ఆధారంగా సదరు షాపు లైసెన్స్ సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారు. జిల్లాలో ఎవరైనా డీలర్లు ఇష్టానుసారంగా విక్రయాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.



జైనథ్‌లో విచారణ చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

అనర్హుల ఏరివేత

- ఆరు నెలలుగా రేషన్ తీసుకోని వారిపై ఫోకస్
- క్షేత్రస్థాయిలో కొనసాగుతున్న విచారణ
- జిల్లాలో ఇప్పటి వరకు 1,363 మంది గుర్తింపు

కైలాస్‌నగర్: రేషన్‌కార్డులు కలిగిన నిరుపేదలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తున్నాయి. అయితే కార్డులు కలిగిన చాలామంది నెలల తరబడి బియ్యం తీసుకోవడం లేదు. ఇలాంటి కార్డులను అనుమానాస్పదంగా గుర్తించిన ప్రభుత్వం అనర్హులను ఏరి వేయాలని భావించింది. ఆ దిశగా ఆదేశాలు జారీ చేసింది. రంగంలోకి దిగిన రెవెన్యూ యంత్రాంగం క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టింది. అనర్హుల లెక్క తేలుస్తోంది. ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా 1,363 మందిని గుర్తించిన అధికారులు వారి కోటా బియ్యం నిలిపివేసే దిశగా చర్యలకు సిద్ధమవుతున్నారు.

అనర్హులను తొలగించేలా..

రేషన్ కార్డుదారులకు రాష్ట్ర ప్రభుత్వం మార్చి నుంచి ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తోంది. అయితే ఇందులో అనర్హులు ఉన్నట్లు గుర్తించి వారిని తొలగించే దిశగా చర్యలు చేపట్టింది. 360 డిగ్రీ సాంకేతిక సాయంతో కొంతమంది ఒకే ఆధార్ నంబర్ కలిగిన కార్డుదారులు రెండు చోట్ల బియ్యం తీసుకుంటున్నట్లుగా గుర్తించింది. వీరితో పాటు ఆరు నెలలుగా బియ్యం తీసుకోని వారి వివరాలు సైతం సేకరించింది. వందేళ్లు దాటిన వారు, ప్రభుత్వ ఉద్యోగాలుపొందినవారు, మరణించినవారు సైతం ఇందులో ఉన్నట్లుగా గుర్తించారు. అలాగే ఇటు జిల్లాతో పాటు పొరుగున ఉన్న మహారాష్ట్రలో నూ పలువురు కార్డులు కలిగి ఉన్నట్లుగా నిర్ధారించారు. ఆయా కార్డుల్లోని సభ్యులను అనుమానితులుగా భావించి ఏరివేయాలని నిర్ణయించారు. దీంతో రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయికి వెళ్లి విచారణ చేస్తున్నారు.అనర్హులుగా తేలితే వెంటనే వారి కార్డులను తొలగిస్తున్నారు.

ఎనిమిది మండలాల్లో విచారణ పూర్తి..

జిల్లాలో మొత్తం 1,91,755 రేషన్ కార్డులున్నాయి. ఇందులో 3,319 కార్డులను అనుమానాస్పదంగా గుర్తించిన కేంద్రం రాష్ట్రానికి విచారణ నిమిత్తం పంపించింది. ఈ కార్డుల్లో 5,675 మంది సభ్యులు ఉండగా రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయిలో విచారిస్తున్నారు. జిల్లాలోని 21 మండలాలకు గాను ఇప్పటి వరకు జైనథ్, భోరజ్, సాత్నాల, తాంసి, ఇచ్చోడ, నేరడిగొండ, సిరికొండ, సొనాల మండలాల్లో విచారణ పూర్తి చేశారు. 1,363 మంది అనర్హులుగా లెక్క తేల్చారు. మిగిలిన మండలాల్లో కొనసాగుతోంది. ఈ నెలాఖరులోపు ప్రక్రియ పూర్తి చేయనున్నట్లుగా అధికారులు చెబుతున్నారు.

త్వరలో ప్రక్రియ పూర్తి చేస్తాం..

త్వరలోనే క్షేత్రస్థాయి విచారణ ప్రక్రియ పూర్తి చేస్తాం. అనర్హులను గుర్తించి వారి పేర్లను రేషన్‌కార్డుల్లో నుంచి తొలగిస్తాం. వారికి కేటాయిస్తున్న బియ్యం పూర్తిస్థాయిలో నిలిపివేస్తాం. – ఎండీ.వాజీద్ అలీ, డీఎస్‌వో

మండలాల వారీగా అనుమానాస్పద రేషన్ కార్డులు, అనర్హులుగా గుర్తించిన వారి వివరాలు

మండలం	రేషన్‌కార్డులు	అనర్హులు
ఆదిలాబాద్‌అర్బన్	945	305
ఆదిలాబాద్ రూరల్	345	102
బజార్‌హత్నూర్	93	00
బేల	187	111
భీంపూర్	105	90
భోరజ్	110	57
బోథ్	113	00
గాదిగూడ	168	14
గుడిహత్నూర్	104	50
ఇచ్చోడ	112	36
ఇంద్రవెల్లి	114	95
జైనథ్	119	58
మావల	139	22
నార్నూర్	120	51
నేరడిగొండ	30	28
సాత్నాల	72	24
సిరికొండ	48	24
సోనాల	64	58
తలమడుగు	95	00
తాంసి	44	23
ఉట్నూర్	192	215

ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా బీఆర్‌ఎస్..

- డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి



మాట్లాడుతున్న అడ్డి భోజారెడ్డి

కైలాస్‌నగర్: బీఆర్‌ఎస్ పార్టీ అనేది ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ అని, అందులోని నాయకులు ఆ కంపెనీ ఓనర్ దొర చెప్పినట్టుగా నడుచుకోవడమే తప్ప ప్రత్యేకంగా చేసేదేమి ఉండదని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి విమర్శించారు. స్థానిక ప్రజాసేవ భవన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజల సమస్యలు, అధికార యంత్రాంగం పనితీరు సమీక్షించేందుకు వచ్చిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి పర్యటన తీవ్ర నిరాశ మిగిల్చిందని మాజీ మంత్రి రామన్న విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మంత్రిగా పనిచేసిన ఆయన జిల్లాకు గతంలో ఏం ఒరగబెట్టారో చెప్పాలని ప్రశ్నించారు. పదేళ్లు అధికారమిస్తే రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని మండిపడ్డారు. సొంత అభివృద్ధి గురించి ఆలోచించారే తప్ప ప్రజల క్షేమాన్ని ఏనాడు పట్టించుకోలేదని విమర్శించారు. పదేళ్లలో బీఆర్‌ఎస్ చేయలేని అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం 15నెలల్లో చేసి చూపిందన్నారు. హైదరాబాద్‌లో మహాన్యూస్ కార్యాలయంపై బీఆర్‌ఎస్ నాయకులు గుండాల్లా దాడి చేయడాన్ని ఖండిస్తున్నట్లుగా తెలిపారు. ఇందులో నాయకులు సంతోష్, నర్సింగ్, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌ల ద్వారా కర్షక మిత్ర రుణాలు

తాంసి: ప్రాథమిక సహకార సంఘాల ద్వారా అందిస్తున్న కర్షక మిత్ర రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన పీఏసీఎస్ పాలకవర్గ సమావేశంలో మాట్లాడారు. సహకార సంఘాల్లో 2018 వరకు మొండి బకాయిలు ఉన్న రైతులు 40శాతం రుణాలు చెల్లిస్తే కొత్త రుణాలు అందించనున్నట్లు తెలిపారు. వ్యవసాయ రుణాలతో పాటు బంగారంపై, ఇళ్ల నిర్మాణానికి ప్రత్యేక రుణాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులకు అవసరమైన ఎరువులు సైతం అందుబాటులో ఉంచుతున్నట్లు వివరించారు. ఇందులో సీఈవో కేశవ్, వైస్‌చైర్మన్ ధనుంజయ్, డైరెక్టర్లు సంతోష్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, బుజ్జన్న, గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

‘యూహెచ్‌సీ’ పనుల పరిశీలన

- అసంతృప్తి వ్యక్తం చేసిన ఎంఈ
- తిరిగి చేపట్టాలని కాంట్రాక్టర్‌కు ఆదేశం



నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎంఈ పేరి రాజు

కైలాస్‌నగర్: మున్సిపల్ పరిధిలోని మహాలక్ష్మివాడ కాలనీలో రూ.1.43 కోట్ల వ్యయంతో చేపట్టిన అర్బన్ హెల్త్‌సెంటర్ భవన నిర్మాణ పనులను మున్సిపల్ ఇంజినీర్ పేరిరాజు, బల్దియా డీఈ కార్తీక్ ఆదివారం పరిశీలించారు. పిల్లర్ల దశ దాటిన పనులను ప్రత్యక్షంగా పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ ప్రభుత్వ ఆమోదిత డిజైన్ ప్రకారం కాకుండా ఇష్టానుసారం చేపడుతున్నట్లుగా గుర్తించారు. ఇప్పటి వరకు జరిగిన నిర్మాణాన్ని పూర్తిగా తొలగించి, తిరిగి నిబంధనల ప్రకారం చేపట్టాలని ఆదేశించారు. కాగా, అధికారుల ఆదేశాలను కాంట్రాక్టర్ అమలు చేస్తాడా లేక రాజకీయ అండతో యథావిధిగా చేపడుతారా అనేది వేచి చూడాల్సిందే.

సమస్యలుంటే సంప్రదించండి

- ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: ప్రజలకు ఏవైనా సమస్యలు ఉంటే స్థానికంగా అందుబాటులో ఉన్న పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఖుర్షాపూర్ కాలనీలో పోలీసులు మీకోసం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలో ఏవైనా అసాంఘిక కార్యకలాపాలు జరిగితే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలు సేవించి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. గంజాయి, మట్కా, పేకాట తదితర అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. డయల్ 100, షీ టీం, మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఇందులో టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు, పోలీస్ సిబ్బంది కాలనీవాసులు పాల్గొన్నారు.



బోనాలతో ఆలయానికి తరలివస్తున్న మహిళలు

మారెమ్మకు బోనాలు

బోనాల సందడి మొదలైంది. పట్టణంలోని శివాజీచౌక్‌లో గల మారెమ్మ ఆలయ వార్షికోత్సవంలో భాగంగా స్థానిక చించర్‌వాడ కాలనీవాసులు ఆదివారం అమ్మవారికి బోనాలు సమర్పించారు. తమ కుటుంబాలను చల్లంగా చూడాలని వేడుకున్నారు. – ఆదిలాబాద్

అంగన్‌వాడీల్లో ‘ఎఫ్‌ఆర్‌ఎస్’



యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్న అంగన్‌వాడీ టీచర్

- అక్రమాలకు ఇక చెక్
- కేంద్రాల్లో ఫేషియల్ రికగ్నైజేషన్
- లబ్ధిదారుల ముఖచిత్రం తప్పనిసరి
- సరుకులు పక్కదారి పట్టకుండా ప్రభుత్వం చర్యలు
- రేపటి నుంచి అమలు

జిల్లాలో..

అంగన్‌వాడీ కేంద్రాలు	1,283
టీచర్లు	1,192
గర్భిణులు	4,483
బాలింతలు	6,000
చిన్నారులు	51,686

ఆదిలాబాద్‌టౌన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఇచ్చే పౌష్టికాహారం, లబ్ధిదారులకు ఇచ్చే సరకులు పక్కదారి పట్టకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జూలై 1నుంచి ఆయా కేంద్రాల్లో ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టమ్ ద్వారా వీటిని అందించాలని కేంద్రం నిర్ణయించింది. ఇప్పటికే గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ముఖచిత్రంతో కూడిన వివరాలను అంగన్‌వాడీ టీచర్లు మొబైల్‌లో ట్రాకర్ యాప్‌లో నమోదు చేశారు. ప్రస్తుతం ఆధార్ అనుసంధానం చేస్తున్నారు. ఈ ప్రకియ పూర్తయిన వెంటనే ఎఫ్‌ఆర్‌ఎస్ అమలు కానుందని ఐసీడీఎస్ అధికారులు చెబుతున్నారు.

ఇప్పటికే కేంద్రం ఆదేశాలు..

లబ్ధిదారులందరికీ ఎఫ్‌ఆర్‌ఎస్ అమలు చేసేందుకు కేంద్ర మహిళాశిశు సంక్షేమ శాఖ నుంచి ఆదేశాలు రావడంతో జిల్లా అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ ప్రక్రియ ఏప్రిల్ నుంచి కొనసాగుతుండగా కొందరికి ఫోన్‌లో ట్రాకర్ పనిచేయకపోవడంతో జాప్యం అవుతోంది.

అక్రమాలకు చెక్ పెట్టేందుకు..

జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం పక్కదారి పడుతుందనే ఆరోపణలున్నాయి. లబ్ధిదారులకు సరుకులు సక్రమంగా పంపిణీ చేయకపోవడం, కొందరు కేంద్రానికి రాకపోయినా వచ్చినట్లు హాజరు నమోదు చేయడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఉన్నతాధికారుల తనిఖీల్లోనూ ఈ విషయాలు పలుమార్లు బయటపడిన సందర్భాలున్నాయి. ఇక నుంచి ఇలాంటి వాటికి చెక్ పెట్టాలని ప్రభుత్వం యోచించింది. ఈ విధానం ద్వారా పిల్లలకు ఇచ్చే బాలామృతం, గుడ్లు, పాలు, మురుకులతో పాటు మెనూ ప్రకారం భోజనం అందనుంది. అలాగే కేంద్రానికి వస్తేనే ఎఫ్‌ఆర్‌ఎస్ ద్వారా హాజరు నమోదు కానుంది. నెలలో ఎంత మంది లబ్ధిదారులు వచ్చారు.. ఎంత మందికి సరుకులు పంపిణీ చేశారు.. తదితర వివరాలు ఇక ఇట్టే తెలుస్తాయి. కేంద్రాల్లో సరుకుల నిల్వ కూడా సులువుగా తెలిసిపోతుంది.

సిగ్నల్ సమస్యతో జాప్యం



ఫోన్లలో సిగ్నల్ సరిగా లేక లబ్ధిదారుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయడం ఇబ్బందిగా మారుతోంది. యాప్‌లు సక్రమంగా పనిచేయడం లేదు. రోజువారీ హాజరు నమోదు కష్టంగా మారుతోంది. కొత్తగా ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టమ్‌లో భాగంగా ముఖ చిత్రాలను నమోదు చేయడం ఇబ్బందిగా ఉంది. అన్ని పూర్తి చేసిన తర్వాతే ఈ విధానం అమలు చేయాలి.– వెంకటమ్మ, అంగన్‌వాడీల సంఘం జిల్లా అధ్యక్షురాలు

పకడ్బందీగా అమలు చేస్తాం



ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎఫ్‌ఆర్‌ఎస్‌ను జిల్లాలో పకడ్బందీగా అమలు చేస్తాం. ఇప్పటికే లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశాం. ప్రస్తుతం ఆధార్‌తో అనుసంధానం చేస్తున్నాం. ఈ ప్రక్రియ ద్వారా సరుకులు పక్కదారి పట్టకుండా నిరోధించేందుకు ఆస్కారం ఉంటుంది. అధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు చేపడుతాం.

– మిల్కా, జిల్లా సంక్షేమ అధికారి

ఆర్టీసీలో ‘టోల్’ బాదుడు

- ప్రయాణికులపై అదనపు వడ్డన
- టికెట్‌పై రూ.10 నుంచి రూ.30వరకు
- పునరాలోచించాలంటున్న ప్యాసింజర్స్



బస్సు దిగుతున్న ప్రయాణికులు

ఆదిలాబాద్: మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా మారింది ఆర్టీసీ ప్రయాణికుల పరిస్థితి. ఇప్పటికే చార్జీల భారంతో, మహాలక్ష్మి పథకం అమలుతో ఇబ్బందుల మధ్య ప్రయాణిస్తున్న వారిపై సంస్థ తాజాగా అదనపు చార్జీలను వడ్డిస్తోంది. టోల్ చార్జీలను కేంద్రం పెంచేయడంతో వాటిని సాకుగా చూపుతూ ప్రతీ టోల్ పరిధిలో రూ.10 అదనంగా వసూలు చేస్తోంది. ఆయా టోల్‌గేట్ల సంఖ్యను బట్టి టికెట్‌పై రూ.10 నుంచి 30 వరకు అదనపు భారం పడుతోంది.

టోల్ బాదుడు..

ఓ వైపు నెలవారీ బస్‌పాస్ చార్జీల పెంపుతోపాటు టికెట్లపై టోల్ ప్లాజా యూజర్ చార్జీలు వసూలు చేస్తుండడంతో ప్రయాణికుల్లో ఆందోళన వ్యక్తం అవుతుంది. టోల్‌ప్లాజా క్రాస్ చేస్తే టికెట్‌పై అదనంగా రూ.10 చెల్లించాల్సి వస్తుంది. ఆదిలాబాద్ నుంచి నిజామాబాద్ మార్గంలో రెండు టోల్ ప్లాజాలు ఉంటాయి. ఈ లెక్కన రూ.20 అదనంగా చెల్లించాల్సి వస్తోంది. ఇక నిర్మల్ నుంచి ఆదిలాబాద్‌కు చూస్తే ఒక టోల్‌ప్లాజ్ ఉంటుంది. ఈ మార్గంలో గతంలో ఎక్స్‌ప్రెస్ చార్జీ రూ.120 ఉండగా, ప్రస్తుతం రూ.130కి చేరింది. ఇప్పటికే మహాలక్ష్మి పథకంతో కిక్కిరిసి వెళుతున్న బస్సుల్లో సీట్లు సైతం దొరకడం లేదని పురుష ప్రయాణికులు వాపోతున్నారు. మరోవైపు చార్జీల పేరిట భారం మోపడం ఎంతవరకు సబబు అనే ప్రశ్నలు వారి నుంచి వ్యక్తం అవుతున్నాయి.

డబ్బులు చెల్లించే వారిపైనే భారం..

మహాలక్ష్మి పథకం అమలుతో పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణ సేవలు పొందుతున్నారు. దీంతో బస్సులు నిండుగా ప్రయాణిస్తున్నాయి. చాలా సందర్భాల్లో సీట్లు ఖాళీగా ఉండడం లేదు. అరకొరగా ఉన్న బస్సుల్లో నిలబడి వెళ్తున్న వారిపై కొత్తగా టోల్ పేరిట చార్జీల భారం మోపడం సరికాదని పురుష ప్రయాణికుల నుంచి అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. ఈవిషయంలో సంస్థ పునరాలోచించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

పునరాలోచించాలి



ఇప్పటికే మహాలక్ష్మి పథకంతో బస్సుల్లో సీట్లు దొరకడం లేదు. చాలా సార్లు నిలబడే ప్రయాణించాల్సి వస్తుంది. ఈ క్రమంలో ఆర్టీసీ టోల్ పేరిట చార్జీలు పెంచడం సరికాదు. పబ్లిక్ వాహనాల కన్నా ప్రైవేట్ వాహనాలపై ప్రయాణిస్తే చార్జీలు కలిసి వస్తున్నాయి. ఇలాగే టికెట్ ధరలు పెంచుకుంటూ పోతే ఆర్టీసీకి ప్రయాణికులు దూరం అవుతారు. తగ్గింపుపై సంస్థ పునరాలోచించాలి.

– అమీర్, కేఆర్కే కాలనీ, ఆదిలాబాద్

క్లుప్తంగా

బైక్ దగ్ధం

కుంటాల: మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయం సమీపాన గుర్తుతెలియని దుండగులు శనివారం అర్ధరాత్రి బైక్‌కు నిప్పంటించారు. గ్రామానికి చెందిన అరిగెల గజ్జారాం వ్యవసాయ పనులు ముగించుకుని తన ఇంటి ముందు బైక్‌కు టార్పాలిన్ కప్పి పార్క్ చేసి ఉంచాడు. అర్ధరాత్రి సమయంలో మంటలు చెలరేగడంతో చుట్టుపక్కల వారు గమనించి గజ్జారాం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అప్పటికే టైర్లు పేలిన శబ్దం వచ్చి, బైక్ దగ్ధమైంది. ఘటన స్థలాన్ని ఎస్సై అశోక్ ఆదివారం పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నకిలీ ధ్రువపత్రాల కేసులో ముగ్గురు అరెస్ట్


వెల్లడిస్తున్న ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్

ఇచ్చోడ: మండలంలోని ఇస్లాంనగర్ కేంద్రంగా నకిలీ నివాస ధ్రువపత్రాలు సృష్టించిన కేసులో కేశవపట్నానికి చెందిన షేక్ కలీం, ఇస్లాంనగర్‌కు చెందిన షేక్ ఫరీద్, జాదవ్ గజానంద్‌ను అరెస్ట్ చేసి రిమాండ్ తరలించినట్లు ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్ తెలిపారు. ఇచ్చోడ సీఐ కార్యాలయంలో ఆదివారం ఈమేరకు వివరాలు వెల్లడించారు. గత రెండునెలల క్రితం ఇస్లాంనగర్‌లో నివాసముంటున్నట్లు ఇతర రాష్ట్రాలకు చెందిన కొందరు యువకులు నకిలీ ధ్రువపత్రాలు పొంది ఆర్మీ, బీఎస్ఎఫ్‌లో ఉద్యోగాలు పొందారు. నిందితులు ముగ్గురు ఇతర రాష్ట్రాలకు చెందిన యువత నివాస ధ్రువపత్రాలు పొందే విషయంలో ఫేక్ ఇంటి నంబర్, ఆధార్‌కార్డులు ఇచ్చి సహకరించారు. ఇందుకు గాను వారి వద్ద నుంచి రూ.9 లక్షలు తీసుకున్నారు. నిందితులు ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నకిలీ ధ్రువపత్రాలు పొంది ఉద్యోగాలు చేస్తున్న 9 మందిపై కేసులు నమోదు చేశామని తెలిపారు. ఈ విషయమై ఆర్మీ, బీఎస్ఎఫ్ ఉన్నతాధికారులతో చర్చిస్తున్నామన్నారు. మండల కేంద్రంలో కొందరు మీ సేవ కేంద్రాల పేరుతో బోర్డులు పెట్టి ఆధార్ కార్డులు మార్ఫింగ్ చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఇచ్చోడ సీఐ బండారి రాజు, ఎస్సై పురుషోత్తం పాల్గొన్నారు.


రెండు దుకాణాల్లో చోరీ

ఆదిలాబాద్‌టౌన్: టూటౌన్ పోలీసుస్టేషన్ సమీపంలోని రెండు దుకాణాల్లో చోరీ జరిగింది. ఆదిత్య మెడికల్,మహాలక్ష్మి కిరాణా షాపుల్లో శనివారం అర్ధరాత్రి దొంగలు పడ్డారు. షెటర్ తాళాలు పగులగొట్టి నగదును ఎత్తుకెళ్లారు. కిరాణా షాపులో రూ.వెయ్యి, మెడికల్ షాపులో సెల్‌ఫోన్ రూ.200 నగదును ఎత్తుకెళ్లారు. ఉదయం యజమానులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు వివరాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు.

శెభాష్.. సింగరేణి

- వెలుగుల రికార్డులకు అవార్డులు
- జాతీయస్థాయిలో ఎస్టీపీపీకి గుర్తింపు
- పక్కాగా విద్యుత్ ఉత్పత్తి, నిర్వహణ
- ఎస్టీపీపీలో సీఎండీ బలరాం మార్క్
- సింగరేణికి తలమానికంగా ప్లాంట్


గోవాలో అవార్డు అందుకుంటున్న ఎస్‌వో టూ ఈడీ ప్రభాకర్‌రావు (ఫైల్)


విద్యుత్ కాంతులు పంచుతున్న ఎస్టీపీపీ

జైపూర్: సింగరేణి సంస్థ ప్రత్యక్షంగా విద్యుత్ రంగంలోకి అడుగుపెట్టి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని నెలకొల్పిన అనతికాలంలో ఉత్పత్తి, నిర్వహణలో దేశస్థాయిలో రికార్డులు బద్దలు కొట్టింది. అత్యధిక పీఎల్ఎఫ్(ప్లాంటు లోడ్ ఫ్యాక్టరీ)తోపాటు నిర్వహణలో జీరో వాటర్ యుటిలైజేషన్, యాష్ వినియోగం, కర్బన ఉద్గారాలు తగ్గిస్తూ పర్యావరణహిత చర్యలు చేపడుతూ శెభాష్ సింగరేణి అనిపించుకుంటోంది. ఒకపక్కన థర్మల్ పవర్ ప్లాంటు, మరో పక్కన భూమిపై సోలార్, నీటిపై తేలియాడే ఫ్లోటింగ్ సోలార్ ఏర్పాటు చేస్తూ జాతీయస్థాయిలో పురస్కారాలు అందుకుంటోంది.

ఇప్పటికే 54 అవార్డులు..

ఎన్టీపీసీ, జెన్‌కో థర్మల్ పవర్ ప్లాంట్‌ను తలదన్నేలా ఎస్టీపీపీ అత్యధిక పీఎల్ఎఫ్ సాధనలో దేశస్థాయిలో వరుసగా మొదటి వరుసలో నిలువడంతోపాటు అన్నివిభాగాల్లో అవార్డులు కైవసం చేసుకుంటోంది. ఎస్టీపీపీకి ఇప్పటికే 54 అవార్డులు వరించాయి. ఈ అవార్డులు అందుకోవడం పట్ల అధికారులు, ఉద్యోగులపై సంస్థ సీఎండీ ఎన్.బలరాం హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎస్టీపీపీలో ఆయన మార్క్ చూపుతూ వారిని ప్రోత్సహిస్తున్నారు.

పర్యావరణ హిత చర్యల్లో మేటి..

పర్యావరణహిత చర్యల్లో భాగంగా కర్బన ఉద్గారాలు తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. సల్ఫర్‌ను ఎఫ్‌జీడీ ఫ్లూ గ్యాస్ డీసల్ఫరైజేషన్ (ఎఫ్‌జీడీ) పద్ధతిలో జిప్సంగా మార్చే పనులు పూర్తయ్యాయి. ఇందుకు రూ.700 కోట్లతో నిర్మాణ పనులు చేపట్టింది. థర్మల్ విద్యుత్ ఉత్పత్తి జరిగే సమయంలో గాల్లోకి సల్ఫర్ ఆక్సైడ్ శాతం ఘనపు మీటర్‌కు 2 వేల మిల్లీగ్రాములు ఉంటోంది. దీంతో వాతావరణంలో తీవ్ర సమస్యలు ఏర్పడుతున్నాయి. 2,200 మిల్లీ గ్రాములకు తగ్గించడానికి దేశంలో ఎక్కడా లేనివిధంగా ఎఫ్‌జీడీ నిర్మాణంతో బొగ్గు బూడిదను వందశాతం గాలిలో కలవకుండా నిలువరిస్తుంది. బొగ్గును మండిస్తే వెలువడే వేడి, నీటిని ఆవిరి రూపంలో మార్చే శక్తితో టర్బైన్లు తిప్పుతూ విద్యుత్ ఉత్పత్తిప్రక్రియ చేపడుతారు. అయితే చివరకు వెలువడే బూడిద, విషవాయువులను శుద్ధి చేస్తున్నారు. ఎలక్ట్రో స్టాటిక్ ప్రెసిపిటేటర్స్‌తో బూడిదను గాలిలో కలువకుండా చేస్తున్నారు. ఇలా వేరు చేసిన యాష్‌ను సిమెంట్, ఇటుకల నిర్మాణ రంగపరిశ్రమలకు విక్రయిస్తున్నారు. ఇలా వందశాతం యాష్ వినియోగం చేస్తూ జాతీయస్థాయిలో బెస్ట్‌ఫ్లైయాష్ యుటిలైజేషన్, ఉత్తమ మెషినరీ అండ్ ఎక్విప్‌మెంట్, ఎనర్జీ ఎఫీషియంట్ ప్లాంటు, ఎక్సలెంట్ ఎనర్జీ ఎఫిషియంట్, పొల్యూషన్ కంట్రోల్ అండ్ ఎక్విప్‌మెంట్, గోల్డెన్ అవార్డు ఇన్ ఎన్విరాన్‌మెంట్ ఎక్సలెన్సీ, జీరో వాటర్ యుటిలైజేషన్‌లో ఇలా 54 అవార్డులు అందుకుంది.

అవార్డులు రావడం గర్వకారణం



సీఎండీ బలరాం దిశానిర్దేశంతో అధికారులు, ఉద్యోగుల సమష్టి కృషి ఫలితంగా పవర్ ప్లాంటు అన్నిరంగాల్లో ముందంజలో నిలుస్తోంది. కర్బన ఉద్గరాలు తగ్గించడానికి ఇప్పటికే ఎఫ్‌జీడీ నిర్మాణం పూర్తయింది. త్వరలో ప్రారంభిస్తాం. అన్నివిభాగాల్లో జాతీయస్థాయిలో అవార్డులు రావడం అందరికీ గర్వకారణం. ఇదే ఉత్సాహంతో పనిచేస్తూ ఎస్టీపీపీని జాతీయ స్థాయిలో అగ్రగామిగా నిలుపుతాం.

– సీహెచ్ చిరంజీవి, ఎస్టీపీపీ ఈడీ

డీఆర్డీఏ డీపీఎంలకు పోస్టింగ్

కైలాస్‌నగర్: గ్రామీణాభివృద్ధిశాఖ పరిధిలోని సెర్ప్ ఆధ్వర్యంలో పనిచేస్తున్న పలువురు డీపీఎంలను ఇటీవల బదిలీ చేసిన ప్రభుత్వం వారికి పోస్టింగ్‌లు కేటాయిస్తూ శనివారం అర్ధరాత్రి ఉత్తర్వులు జారీచేసింది.ఇతరజిల్లాల నుంచి పలువురు జిల్లాకు రాగా, ఇక్కడ పనిచేస్తున్న పలువురు ఇతర జిల్లాలకు బదిలీ అయ్యారు. పోస్టింగ్ పొందిన వారు వెంటనే విధుల్లో చేరాలని స్పష్టం చేశారు. కాగా,జిల్లాలో పనిచేస్తున్న టి.హేమలత, ఆర్.శోభారాణిలకు ఇంకా పోస్టింగ్ ఖరారు చేయకుండా రిజర్వులో ఉంచారు.

డీపీఎం పేరు	ప్రస్తుతం పనిచేస్తున్న ప్రాంతం	బదిలీ ప్రాంతం
బి.గంగన్న	డీపీఎం నాన్‌ఫార్మ్ ఆదిలాబాద్	ఫైనాన్స్ నిర్మల్
జాదవ్ శేషారావు	సోషల్‌సెక్యూరిటీ ఆదిలాబాద్	సోషల్ సెక్యూరిటీ ఆసిఫాబాద్
ఈ.శోభారాణి	స్పెషల్ ప్రాజెక్ట్స్ ఆదిలాబాద్	డీపీఎం ఫాం నిర్మల్
బి.నరేందర్	ఫైనాన్స్‌ఆదిలాబాద్	ఫైనాన్స్, ఆసిఫాబాద్
ఎల్.సుగంధ	ఫాం, ఎల్‌హెచ్, ఆదిలాబాద్	డీపీఎం అడిషనల్ డీఆర్‌డీఏ
ఎస్.వకుల	డీపీఎం ఫాం, కామారెడ్డి	డీపీఎం సోషల్ సెక్యూరిటీ,ఆదిలాబాద్
జి.రమాకాంత	డీపీఎం బ్యాంకు లింకేజీ భద్రాద్రి కొత్తగూడెం	డీపీఎం ఐబీ, ఆదిలాబాద్
కె.జ్ఞాను	డీపీఎం ఐబీ, నిర్మల్	డీపీఎం ఫైనాన్స్, ఆదిలాబాద్
జాడి మల్లేశ్	డీపీఎం నాన్‌ఫాం, ఎల్‌హెచ్, జగిత్యాల	డీపీఎం స్పెషల్ ప్రాజెక్ట్స్, ఆదిలాబాద్

బాలికల అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలి

- ఈ ఘటనపై పూర్తి వివరాలు అందజేయండి
- రాష్ట్ర డీజీపీ, ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ
- విచారణను నేటికి వాయిదా వేసిన రాష్ట్ర మానవహక్కుల కమిషన్

హైదరాబాద్: మైనర్ బాలికల అక్రమ రవాణాపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ తీవ్రంగా మండిపడింది. ఇంతటి నీచానికి పాల్పడిన వారిపై విచారణ చేపట్టి కఠినంగా శిక్షించాలని సంబంధిత అధికారులను కోరింది. ఆదిలాబాద్ జిల్లాలో మైనర్ బాలికలను అక్రమ రవాణ చేస్తున్నారని ఆదివారం పలు పత్రికల్లో 'అమ్మకానికి నిరుపేద అమ్మాయిలు' అనే వార్త ప్రచురితమైంది. ఈ కథనాన్ని చూసిన రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ సూమోటోగా కేసు స్వీకరించింది. దీనిపై పూర్తి వివరాలను నేడు(సోమవారం) అందజేయాలని రాష్ట్ర డీజీపీతోపాటు ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేస్తూ విచరణను వాయిదా వేసింది. మహారాష్ట్ర లోని యవత్‌మల్ జిల్లా ఘాటంజీ తాలూకా కిని గ్రామానికి చెందిన ఆత్రం నిర్మల, బాపుణ్య భార్యాభర్తలు. వీరు గత నెలలో ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలోని ఒక గ్రామానికి కూలీ పనులకని వచ్చి కొన్నాళ్లు తెలిసిన వారి ఇంట్లో ఉన్నారు. ఆ ఇంట్లో తల్లి దండ్రులు లేని బంధువుల 16 ఏళ్ల మైనర్ బాలిక ఉండటంతో నెమ్మదిగా మచ్చిక చేసుకున్నారు. కొంతకాలం తర్వాత మహారాష్ట్రలోని తమ ఊరిలో పండగకని చెప్పి ఆ బాలికను తీసుకెళ్లారు. రాజస్థాన్‌లోని కోటా సమీపంలో ఉన్న ఓ గ్రామంలో రూ.10 వేలకు అమ్మేశారు. అక్కడ మొదటి భార్యను వదిలేసిన కరణ్ అనే వ్యక్తి బాలికను వివాహం చేసుకున్నట్లు ఆదిలాబాద్ భీంపూర్ పోలీసులు గుర్తించారు. రాజస్థాన్‌లో ఉన్న ఆ బాలిక వివరాలు ఇన్‌స్టాగామ్ ద్వారా బయటికి రావడం విశేషం. దీంతో పలు వార్త పత్రికల్లో ఈ వార్త ప్రచురితం కావడంతో రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ స్పందించి సూమోటో కేసుగా స్వీకరించి విచారణకు ఆదేశించింది.

మెడికల్ కాలేజీకి మృతదేహం అప్పగింత

- ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి నేత్రాలు దానం


అమృతమ్మ (ఫైల్)


కళాశాలలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న వైద్య విద్యార్థులు

మందమర్రిరూరల్: మంచిర్యాల మెడికల్ కళాశాలకు వృద్ధురాలి మృతదేహాన్ని కుటుంబ సభ్యులు అప్పగించారు. ఆమె నేత్రాలను ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి దానం చేశారు. వివరాలు ఇలా.. మండలంలోని మామిడిగట్టు గ్రామానికి చెందిన మండల అమృతమ్మ(90) శనివారం రాత్రి మృతిచెందింది. తల్లి మృతి చెందినప్పటికి పది మందికి ఉపయోగపడాలని కుమారుడు శ్యాంసుందర్‌రెడ్డి ఆలోచన చేశాడు. తల్లి నేత్రాలను ఎల్వీ ప్రసాద్ కంటి వైద్యశాల(ఐ బ్యాంక్)కు అప్పగించారు. మృతదేహాన్ని మంచిర్యాల మెడికల్ కళాశాల వారికి సదాశయ ఫౌండేషన్ ద్వారా అప్పగించారు. సదాశయ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి సమ్మయ్య ఆదివారం వైకుంఠరథంలో మృతదేహాన్ని తీసుకెళ్లారు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కన్నీటితో తుది వీడ్కోలు పలికారు. మృతురాలికి భర్త రాజిరెడ్డి ఉన్నారు.

సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలి

- కార్మిక సంఘాల జేఏసీ పిలుపు


మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

శ్రీరాంపూర్: కేంద్రం కొత్తగా తెచ్చిన 4 లేబర్ కోడ్‌లకు నిరసనగా జూలై 9న జరిగే దేశ వ్యాప్త సమ్మెను సింగరేణిలో విజయవంతం చేయాలని కార్మిక సంఘాల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. నస్పూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏఐటీయూసీ అధ్యక్షుడు వి.సీతారామయ్య, టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి, ఐఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శి ఏనుగు రవీందర్‌రెడ్డి, ఐఎఫ్‌టీయూ అధ్యక్షుడు విశ్వనాథ్ మాట్లాడారు. కేంద్రం 44 కార్మిక చట్టాల స్థానంలో 4 లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందన్నారు. ఈ కోడ్‌లు జూలై నుంచి అమలు చేయడానికి కేంద్రం చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. ఇవి అమలైతే కార్మిక వర్గం తమ హక్కులను కోల్పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తమ డిమాండ్ల సాధన కోసం, సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేసే హక్కును కూడా కోల్పోతారన్నారు. కార్మిక సంఘాల ఉనికిని ప్రశ్నార్థకం అవుతుందని తెలిపారు. దీనిని కార్మికవర్గం ముక్తకంఠంతో వ్యతిరేకించాలన్నారు. ఈ సమ్మె విజయవంతంతో కేంద్రం దిగివస్తుందన్నారు. అవసరమైతే నిరవధిక సమ్మెకు కూడా సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, బ్రాంచి కార్యదర్శి షేక్ బాజీసైదా, నాయకులు కొముర‌య్య, కిషన్‌రావు, ఐఎన్టీయూసీ కేంద్ర ఉపాధ్యక్షులు గరిగే స్వామి, ల్యాగల శ్రీనివాస్, టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, బ్రాంచి ఉపాధ్యక్షుడు బండి రమేశ్, సీఐటీయూ బ్రాంచి అధ్యక్షుడు గుల్ల బాలాజీ, కస్తూరి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తెరుచుకోనున్న 'బాబ్లీ' గేట్లు

- జూలై 1న 14 గేట్లు ఎత్తనున్న త్రిసభ్య కమిటీ సభ్యులు
- ఎస్సారెస్పీలోకి గోదావరి ప్రవాహం

ప్రాజెక్టు పేరు : బాబ్లీ
నిర్మాణ స్థలం : గోదావరి నదిపై మహారాష్ట్రలోని ధర్మాబాద్ తాలుకా బాబ్లీ గ్రామం వద్ద గేట్లు : 14
నీటి నిల్వ సామర్థ్యం : 2.74 టీఎంసీ
గేట్లను పైకి ఎత్తే తేదీ : ప్రతియేట జూలై 1 నుంచి
తిరిగి గేట్లను దించేతేదీ : ప్రతియేట అక్టోబర్ 28
దూరం : తెలంగాణ రాష్ట్ర సరిహద్దుకు 7 కిలోమీటర్లు, బాసరకు 18 కిలోమీటర్లు


బాబ్లీ ప్రాజెక్టు(ఫైల్)

భైంసా:మహారాష్ట్ర ప్రభుత్వం గోదావరి నదిపై నిర్మించిన వివాదాస్పద బాబ్లీ ప్రాజెక్టు గేట్లు జూలై 1 నుంచి తెరుచుకోనున్నాయి. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు, ప్రతి ఏటా జూలై 1 నుంచి అక్టోబర్ 28 వరకు 14 గేట్లను ఎత్తి నీటిని విడుదల చేయనున్నారు. ఈ నీరు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్సారెస్పీ)లోకి చేరనుంది, దీనివల్ల నిజామాబాద్, నిర్మల్ జిల్లాల రైతులకు తాగు,సాగునీటి అవసరాలు తీరనున్నాయి.

త్రిసభ్య కమిటీ పర్యవేక్షణలో

బాబ్లీ ప్రాజెక్టుపై ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నో పోరాటాలు, కోర్టు వివాదాలు జరిగాయి. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం, వర్షాకాలంలో గోదావరి నది ప్రవాహానికి అడ్డంకులు లేకుండా గేట్లు తెరిచి ఉంచాలని నిర్దేశించింది. ఈ ప్రక్రియను పర్యవేక్షించేందుకు సుప్రీం కోర్టు నియమించిన త్రిసభ్య కమిటీ సభ్యుల సమక్షంలో మహారాష్ట్ర, తెలంగాణ నీటిపారుదల శాఖ అధికారులు జూలై 1న గేట్లను ఎత్తనున్నారు.

ఎస్సారెస్పీలో ప్రస్తుతం..

ప్రస్తుతం ఎస్సారెస్పీలో 1064.60 అడుగుల వద్ద 15.567 టీఎంసీల నీటి నిల్వ ఉంది. బాబ్లీ గేట్ల నుంచి విడుదలయ్యే వరద నీరు ఈ ప్రాజెక్టులోకి చేరనుంది. ఎస్కేప్ గేట్ల ద్వారా 100 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల నీటిని ఎస్సారెస్పీ నుంచి విడుదల చేస్తున్నారు. బాబ్లీ నుంచి వచ్చే నీరు నిజామాబాద్ జిల్లాలోని కందకుర్తి, బాసర మీదుగా ఎస్సారెస్పీకి చేరుతుంది. తెలంగాణ సరిహద్దుకు 7 కిలోమీటర్ల దూరంలో ఉన్న బాబ్లీ నుంచి ఎస్సారెస్పీ వరకు సుమారు 70 కిలోమీటర్ల దూరం ఉండగా, నీరు చేరడానికి కొంత సమయం పడుతుంది.

రైతులకు ఉపయోగం..

ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో, బాబ్లీ గేట్ల విడుదలతో గోదావరి నది నిండుగా ప్రవహించనుంది. దీనివల్ల నిజామాబాద్, నిర్మల్ జిల్లాల్లోని ఎత్తిపోతల పథకాల కింద లక్షల ఎకరాల్లో సాగు చేస్తున్న రైతులకు పుష్కలంగా నీరు అందనుంది. రైతులు ఇప్పటికే వరి నారుపోసి, మరో వారంలో నాట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ సమయంలో బాబ్లీ నీటి విడుదల రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

ఏర్పాట్లు చేసిన నీటిపారుదల శాఖ..

బాబ్లీ గేట్ల విడుదల కోసం మహారాష్ట్ర, తెలంగాణ నీటిపారుదల శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వర్షాలు జోరందుకునే ముందే గేట్లను తెరిచి, సహజ నీటి ప్రవాహాన్ని ఎస్సారెస్పీకి చేరేలా చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రక్రియ వర్షాకాలంలో గోదావరి నది పరివాహక ప్రాంతంలోని సాగు, తాగునీటి అవసరాలను తీర్చడంలో కీలక పాత్ర పోషిస్తుంది.

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా


బోల్తాపడిన బస్సు


పరామర్శిస్తున్న రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్

- జాతీయ రహదారి 44పై గుడిహత్నూర్ వద్ద ఘటన
- నలుగురికి తీవ్ర, 28 మందికి స్వల్ప గాయాలు
- రిమ్స్‌కు క్షతగాత్రుల తరలింపు
- తప్పిన పెను ప్రమాదం

గుడిహత్నూర్: మండల కేంద్రంలోని జాతీయ రహదారి 44పై ఆదివారం తెల్లవారుజామున ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. మరో 28 మందికి స్వల్ప గాయాలయ్యాయి. హైదరాబాద్ నుంచి మహారాష్ట్రలోని అమరావతికి వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రత్యక్షసాక్షులు, పోలీసులు తెలిపిన వివరాలు.. ఆరెంజ్ ట్రావెల్స్ బస్సులో మొత్తం 32 మంది ఉన్నారు. శనివారం రాత్రి 11 గంటలకు హైదరాబాద్ నుంచి ట్రావెల్స్ బస్సు బయల్దేరింది. ఆదివారం తెల్లవారుజామున 4:30 గంటల ప్రాంతంలో మండల కేంద్రానికి చేరుకుంది. కాగా, మండల కేంద్రంలో సర్వీసు రోడ్డు పనులు నేపథ్యంలో నిర్మాణ సంస్థ ప్రమాద హెచ్చరికల బోర్డు ఏర్పాటు చేసింది. అయితే ఈ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు వెనుకాల మరో బస్సు వేగంగా వస్తోంది. ట్రావెల్స్ డ్రైవర్ ఆ బస్సు వెళ్లడానికి దారి ఇచ్చేక్రమంలో హెచ్చరిక బోర్డు దాటగా సర్వీసు రోడ్డుపై మెల్లగా బస్సు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో నలుగురికి తీవ్రగాయాలు కాగా, అందులో జిల్లా కేంద్రంలోని టీచర్స్ కాలనీకి చెందిన గాడిగు నరేంద్ర, అమరావతికి చెందిన ఇర్ఫాన్ మన్స్రీ, యవత్మాల్ జిల్లా ఘటానాకు చెందిన ఎండీ హర్బాజ్, అమరావతి పరత్‌వాడకు చెందిన ఆనంద్ అగ్రవాల్ ఉన్నారు. పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని క్షతగాత్రులను రిమ్స్‌కు తరలించి చికిత్స అందజేశారు. రిమ్స్‌లో క్షతగాత్రులను డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ పరామర్శించారు. అయితే బస్సు వేగం తగ్గించడంతో మెల్లగా మట్టి రోడ్డుపై పడడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు పేర్కొంటున్నారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వై.మధుకృష్ణ తెలిపారు.

విద్యార్థిని నృత్య ప్రదర్శన


నృత్య ప్రదర్శన చేస్తున్న వైష్ణవి

బోథ్: మండల కేంద్రానికి చెందిన నాంపల్లి సాయిసాగర్–అనిత దంపతుల కుమార్తె వైష్ణవి తిరుమల తిరుపతి దేవస్థానం వద్ద నిర్వహించే భక్తి నృత్య ప్రదర్శనలో పాల్గొంది. నిర్మల్ జిల్లా కేంద్రంలో ప్రైవేట్ పాఠశాలలో 3వ తరగతి చదువుతున్న ఆమె నృత్యంపై మక్కువతో శిక్షణ తీసుకుంది. కాగా, టీటీడీ వద్ద నృత్యం చేయడానికి అవకాశం వచ్చింది. ఈ సందర్భంగా వైష్ణవి చేసిన నృత్యం అందరినీ అలరించింది. తన కూతురికి అక్కడ నృత్యం చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నట్లు తల్లిదండ్రులు తెలిపారు.

బీసీ రిజర్వేషన్ బిల్లు అమలు చేయాలి


మాట్లాడుతున్న చిరంజీవులు

పాతమంచిర్యాల: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లును రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని తెలంగాణ బీసీ మేధావుల ఫోరం చైర్మన్, విశ్రాంత ఐఏఎస్ అధికారి చిరంజీవులు అన్నారు. మంచిర్యాలలోని చార్వాక భవన్‌లో జిల్లా కేంద్రంలోని ఏర్పాటు చేసిన బీసీ చైతన్య సదస్సులో ఆయన మాట్లాడారు. రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన 30 రోజుల వ్యవధిలో 42 శాతం రిజర్వేషన్ బిల్లు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. అఖిలపక్షాన్ని ఒప్పించి బీసీ రిజర్వేషన్ బిల్లును భారత రాజ్యాంగం 9వ షెడ్యూల్‌లో చేర్పించే బాధ్యత కేంద్రానితే అని తెలిపారు. అగ్రవర్ణాల కోసం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ బిల్లును ఆఘమేఘాల మీద చక్కబెట్టిన కేంద్రం అదే రీతిన బీసీ రిజర్వేషన్ బిల్లుకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. జాతీయస్థాయిలో కుల గణన సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. బీసీ మేధావుల ఫోరం అధ్వర్యంలో చేపట్టే పోరాటాలను ఉమ్మడి జిల్లా బీసీలు విజయివంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీ బడి నిర్వాహకులు పిడికిలి రాజు, బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం కోర్ కమిటీ సభ్యులు ప్రొఫెసర్ వీరస్వామి, అవ్వారు వేణుకుమార్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ నీలకంఠేశ్వర్‌రావు, బీసీ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కనుకుంట్ల మల్లయ్య, సామాజిక న్యాయ వేదిక కన్వీనర్ రంగు రాజేశం, బీసీ రాజ్యాధికార సమితి జిల్లా కార్యదర్శి వేముల అశోక్, విశ్రాంత ఎంఈవో కొండయ్య, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గాజుల ముఖేష్‌గౌడ్, బీసీ నాయకులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వం పేదలకు పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యాన్ని అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పక్కా సమాచారం అందడంతో టూటౌన్ పోలీసులు పట్టణంలోని క్రాంతినగర్‌కు చెందిన గోకుల్వార్ రాజు ప్రకాశ్ ఇంట్లో ఆదివారం దాడి చేశారు. అక్రమంగా నిల్వ ఉన్న 7 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ బియ్యాన్ని బ్రాండెడ్ సంచులైన టొమాటో గోల్డ్ రైస్ బ్యాగుల్లో నింపి విక్రయిస్తున్నట్లుగా గుర్తించారు. పట్టణంలోని శివాజీచౌక్‌లో గల తన కిరాణాషాపులో విక్రయిస్తున్నారని సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా అకాడి పూజలు


ఇంద్రవెల్లి: సమాక గ్రామ పొలిమేరలో అకాడి పూజలు చేస్తున్న ఆదివాసీలు


ఇచ్చోడ: బాదిగూడలో పూజలు చేస్తున్న ఆదివాసీలు

ఆషాడమాసం ప్రారంభంతో ఆదివాసీ గ్రామాల్లో అకాడి పూజలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇచ్చోడ మండలం బాదిగూడతోపాటు ఇంద్రవెల్లి మండలం సమాక, కేస్లాపూర్, పాటగూడ, ముత్నూర్ గ్రామాల ఆదివాసీలు పొలిమేరకు వెళ్లి వనదేవతలకు పూజలు చేశారు. సంప్రదాయ వంటలు తయారు చేసి నైవేద్యాలు సమర్పించారు. ప్రజలతోపాటు పంటలు, పశుపక్ష్యాదులు బాగుండాలని మొక్కినట్లు గ్రామాల ఆదివాసీ పెద్దలు తెలిపారు. గ్రామాల పెద్దలు కొరెంగా యేశ్వంత్‌రావ్ మహారాజ్, పెందోర్ భగ్వంత్‌రావ్, జంగు, లక్ష్మణ్, సోయం భీంరావ్, గ్రామపటేల్ సిడాం లక్ష్మికాంత్, దేవారి పెందుర్ బండు, గ్రామస్తులు తులిసిరాం, చిత్రం దేవ్‌రావు, వంద్రం రాజు, మెస్రం అమృత్‌రావు, సిడాం మధుకర్ తదితరులు పాల్గొన్నారు. – ఇంద్రవెల్లి/ఇచ్చోడ